సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


ఆదివారం । 22 । అక్టోబర్ । 2023

I



అన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఘట్టమనేని వెంకట భరత్‌కుమార్, జ్యోతి దంపతులు (దువ్వాడ, విశాఖపట్నం) శనివారం రూ. 1,11,116 విరాళం సమర్పించారు.




దసరా వ్యాపారం అదిరింది

దసరా వ్యాపారం అదిరింది.. మూడు పువ్వులు - ఆరు కాయలు అన్నట్టు దుస్తులు, బంగారం, వివిధ గృహోపకరణాలు, ద్విచక్ర వాహనాలు, కార్ల అమ్మకాలు జోరందుకున్నాయి.

- IIలో

డెల్టాలకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం యథావిధిగా నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.



కొంకాపల్లి

కొంకాపల్లి దసరా ఊరేగింపులకు 1835లో శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి నేటి వరకూ అంటే నాలుగు తరాలుగా ఈ ఉత్సవాలు, వీర విద్యా విన్యాసాలు కొనసాగుతున్నాయి. ఐరావతం, రాజహంస వాహనాలతో ఈ వీధి ఊరేగింపు జరుగుతుంది. మిగిలిన వీధులతో పోలిస్తే అత్యధికంగా 188 ఏళ్ల చరిత్ర కొంకాపల్లి సంబరాల సొంతం.



మహిపాల వీధి

కొంకాపల్లి తర్వాత మహిపాల వీధి ఉత్సవాలకు 168 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ వీధిలో వీర విద్యకు, దసరా ఊరేగింపులకు 1856లో బీజం పడింది. ఈ వీధి రాజహంస వాహనంతో దసరా ఊరేగింపులు, వీరవిద్య ప్రదర్శనలు ఉంటాయి.



గండు వీధి

గండు వీధి దసరా ఊరేగింపులకు 1911లో శ్రీకారం చుట్టారు. శ్రీశేషశయనం, విష్ణుమూర్తి వాహనాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ వీధి ఉత్సవాలది 113 ఏళ్ల చరిత్ర.



కర్రలతో కలబడుతూ..

సండే స్పెషల్



రవణం మల్లయ్య వీధి

రవణం మల్లయ్య వీధికి 108 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడి ఊరేగింపులకు 1915లో బీజం పడింది. శ్రీ గరుడ విష్ణు రూపంలో ఈ వీధి వాహనం ఉంటుంది.



శ్రీరామపురం

శ్రీరామపురం వీధి ఊరేగింపులు 1945లో మొదలయ్యాయి. వీటికి 79 ఏళ్ల చరిత్ర ఉంది. వినాయక, నాగసర్ప, ఐరావతం, హంస వాహనాలతో ఈ వీధి ఊరేగింపు జరుగుతుంది.



రవణం వీధి

76 ఏళ్ల చరిత్ర కలిగిన రవణం వీధి ఊరేగింపులకు 1947లో నాంది పడింది. ఈ వీధి వాహనం పేరు శ్రీమహిషాసురమర్దిని అమ్మవారు. ఈ వీధిలో దసరా ఊరేగింపుల నాడు అమ్మవారి మెడలో తొలి పూల దండ వేసేందుకు వేలం పాట నిర్వహించడం ఆనవాయితీ. ఈ దండ వేసే అవకాశాన్ని పాటదారులు వేలాది రూపాయలకు పాడుకుని దక్కించుకోవడం కూడా విశేషమే.



నల్లా వీధి

నల్లా వీధి ఉరేగింపులకు 56 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ 1967లో ఊరేగింపులు మొదలయ్యాయి. ఈ వీధి వాహనం పేరు శ్రీ విజయదుర్గ అమ్మవారు.

సంగ్రామ సంబరాలు



అగ్గిబరాటాల విన్యాసం

- విచ్చుకత్తులతో.. వీర విహారం
- యుద్ధ వాతావరణాన్ని తలపించేలా ఆయుధ ప్రదర్శనలు
- గగుర్పాటు కలిగించే అగ్గిబరాటాలు
- తరాలు మారినా తరగని చెడీ తాలింఖానా ఖ్యాతి
- 7 వీధుల వాహనాల సమ్మేళనంతో భారీ ఊరేగింపులు
- అమలాపురం దసరా ఉత్సవాల ప్రత్యేకత

అమలాపురం టౌన్/అమలాపురం రూరల్: విచ్చుకత్తుల వీరవిహారం.. కళ్లకు గంతలు కట్టుకుని వ్యక్తి శరీరంపై కూరగాయలను ఒక్క కత్తివేటుతో అతడికి చిన్నపాటి గాయం కూడా కాకుండా తెగనరకడం.. కర్రలతో తలబడటం.. నిప్పుల బంతులు దూసుకు వచ్చినట్టుగా అగ్గిబరాటాల విన్యాసాలు.. గగుర్పాటు కలిగించే ఇటువంటి వీర విన్యాసాలు అమలాపురం దసరా ఉత్సవాలకే ప్రత్యేకం.

అమలాపురం దసరా ఉత్సవాలకు, ఏడు వీధుల వాహనాల సమ్మేళనంతో సాగే ఊరేగింపులకు, యుద్ధ వాతావరణాన్ని తలపించే చెడీ తాలింఖానా ఆయుధ విన్యాసాలకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి ఉంది. తరాలు మారినా తరగని చెడీ తాలింఖానా ప్రదర్శనల ప్రత్యేకత అమలాపురం దసరా ఉత్సవాలపై బలమైన ముద్ర వేసింది. కొంకాపల్లి, మహిపాలవీధి, గండు వీధి, రవణం వీధి, రవణం మల్లయ్యవీధి, శ్రీరామపురం, నల్లా వీధి.. ఇలా ఈ ఏడు వీధులూ తరతరాలుగా ఈ వీరవిద్యకు జీవం పోస్తున్నాయి. దసరా ఉత్సవాలకు నాంది పలుకుతూ ఈ ఏడు వీధుల ఉత్సవ కమిటీల వారు తమతమ దేవతామూర్తుల వాహనాల వద్ద ఆయుధ పూజలు చేసి, చెడీ తాలింఖానా వీర విద్యకు కసరత్తులు మొదలు పెట్టడం ఆనవాయితీ. తమ తమ వాహనాలపై అమ్మవార్లను ఊరేగిస్తూ దసరా ఉత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. ఈ నెల 25న అమలాపురంలో ఏడు వీధుల వాహనాల సమ్మేళనం నడుమ ఊరేగింపులు, చెడీ తాలింఖానా ప్రదర్శనలు ఉత్కంఠభరితంగా జరుగుతాయి. ఇప్పటికే ఆయా ఉత్సవ కమిటీలు ఊరేగింపులకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. దాదాపు 600 మంది పోలీసులతో భారీ బందోబస్తు నడుమ ఈ ఊరేగింపులు పకడ్బందీగా జరగనున్నాయి. ప్రతి వీధి ఉత్సవానికీ ఘనమైన చరిత్ర ఉంది.

చెడీ తాలింఖానా ప్రదర్శనలతోనే ఈ గుర్తింపు



కేవలం చెడీ తాలింఖానా ప్రదర్శనల వల్లే అమలాపురం దసరా ఉత్సవాలకు ఇంతటి గొప్ప గుర్తింపు వచ్చింది. దసరా వస్తోందంటే పట్టణంలోని ఏడు వీధుల ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన చాలా నిష్ఠతో భేతాళస్వామిని ఆరాధిస్తూ నియమ నిబంధనలతో ఆయుధ పూజలు చేసి, వీర విద్య ప్రదర్శనలకు శ్రీకారం చుడతాం. ఈ ఉత్సవాలు, ఊరేగింపులను తిలకించేందుకు రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా విదేశాల్లో ఉన్నవారు కూడా తరలి వస్తుంటారు.

– పనసా బుజ్జి, కొంకాపల్లి

188 సంవత్సరాలుగా..

ఈ ప్రాచీన వీర విద్యకు అమలాపురంలో బీజం పడి 188 ఏళ్లు కావస్తోంది. బ్రిటిష్ వారి కాలంలోనే నాలుగు వీధుల వాహనాలతో అమలాపురంలో దసరా ఉత్సవాలు నిర్వహించేవారు. కొంకాపల్లి, మహిపాల వీధికి చెందిన చెడీ తాలింఖానా ఆద్యులు అప్పట్లో బ్రిటిష్ ప్రభుత్వం నుంచి తామ్రపత్రాలు కూడా అందుకున్నారంటే ఈ వీర విద్యకు, ఈ ఉత్సవాలకు ఎంతటి ఖ్యాతి ఉందో అర్థం చేసుకోవచ్చు. పాండవులు అజ్ఞాతవాస సమయంలో తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై దాచారని మహాభారతం చెబుతోంది. అదేవిధంగా అమలాపురం చెడీ తాలింఖానా ఉత్సవ కమిటీలు కూడా తమ ఆయుధాలను ఒకచోట దాచి, దసరాకు ముందు బయటకు తీసి, వాటికి పూజలు చేసి, ప్రదర్శనలకు సమాయత్తం కావడం సంప్రదాయంగా వస్తోంది. పట్టా కత్తులు, డాళ్లు, లేడి కొమ్ములు, అగ్గిబరాటాలు, కర్రలు ఇలా పలు రకాల ఆయుధాలతో ఒకరితో ఒకరు తలడపడం చెడీ తాలింఖానా వీర విద్య ఈ ప్రదర్శనల్లో కనిపిస్తుంది.



కళ్లకు గంతలు కట్టుకుని మనిషి ఉదరంపై కొబ్బరి కాయను కత్తితో నరుకుతున్న చెడీ తాలింఖానా సాధకుడు (ఫైల్)




దసరా సంబరాల్లో కత్తులు దూస్తూ..

న్యూస్‌రీల్

జగనన్న సివిల్ సర్వీసెస్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి ఆర్థికంగా వెనుకబడిన, ఎస్సీ, బీసీ వర్గాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి ఎం.లక్ష్మీదేవి శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందిస్తారన్నారు. 2023లో నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఇన్ పోర్టల్‌లో అందించిన వెబ్‌లింక్ ద్వారా వచ్చే నెల నాలుగో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్డీఓగా కేశవవర్ధన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన కేశవవర్ధన్‌రెడ్డి

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్డీఓగా గండ్లూరి కేశవవర్ధన్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్‌గా అనంతపురం జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన తొలిసారిగా అమలాపురం ఆర్డీఓగా నియమితులయ్యారు. ఆర్డీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన కేశవవర్ధన్‌రెడ్డిని తహసీల్దార్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

బర్త్‌డే పార్టీలో విషాదం

- వేడుక కోసం యానాం వచ్చిన ఏడుగురు యువకులు
- గౌతమీ గోదావరిలో నలుగురి గల్లంతు
- ముమ్మరంగా గాలింపు
- గోపులంక వద్ద దుర్ఘటన



ప్రమాదం నుంచి బయటపడ్డ యువకులతో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, ఆర్డీఓ కిషోర్

తాళ్లరేవు: పెద్దగా పరిచయం లేని ప్రాంతం.. అందునా అక్కడ గౌతమీ గోదావరి ప్రవాహ వేగం అధికం.. అటువంటిచోట ఏమాత్రం అంచనా లేకుండా.. కేవలం స్నానం చేయాలన్న ఉత్సాహంతో నదిలో దిగిన నలుగురు యువకులు గల్లంతైన ఘటన.. వారి కుటుంబ సభ్యులకు, మిత్రులకు తీరని విషాదాన్ని మిగిల్చింది. తాళ్లరేవు మండలం గోపులంక వద్ద శనివారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది.

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు సమీపంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన హనుమకొండ కార్తీక్ పుట్టిన రోజు కొద్ది రోజుల కిందట జరిగింది. ఆ సందర్భంగా పార్టీ ఇస్తానని స్నేహితులకు చెప్పాడు. ఆ మేరకు కార్తీక్‌తో పాటు సలాది దుర్గామహేష్, కొమ్మిరెడ్డి చైతన్య, ముద్దన ఫణీంద్ర గణేష్, పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ, నేదూరి భానుప్రసాద్ కలిసి మూడు మోటార్ సైకిళ్లపై బయలుదేరి శనివారం తణుకు నుంచి యానాం చేరుకున్నారు. అక్కడ బర్త్‌డే పార్టీ చేసుకున్నారు. గతంలో కార్తీక్ రెండు మూడు సార్లు యానాం వచ్చాడు. ఇక్కడి ప్రాంతాలు అతడికి కాస్త తెలుసు. దీంతో పార్టీ ముగిసిన అనంతరం వారు జొన్నాడ మీదుగా రావులపాలెం వెళ్లేందుకు ఏటిగట్టు రహదారిపై బయలుదేరారు. మార్గం మధ్యలో యానాం పట్టణానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోపులంక పుష్కర్ ఘాట్ వద్ద గౌతమీ గోదావరిలో స్నానం చేయాలని భావించారు. తొలుత స్నానం చేసేందుకు పెండ్యాల బాలాజీ, తిరుమల రవితేజ, ముద్దన ఫణీంద్ర గణేష్ నదిలోకి దిగారు.

అరణ్య రోదనే..

వారు ఒడ్డున స్నానం చేస్తుండగా కార్తీక్ ఒక్కసారిగా రెట్టించిన ఉత్సాహంతో వేగంగా వెళ్లి, గోదావరిలో దూకి, ప్రవాహ వేగానికి గల్లంతైపోయాడు. ప్రమాదాన్ని గమనించిన బాలాజీ, రవితేజ, గణేష్‌లు కార్తీక్‌ను కాపాడేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో వారు కూడా నదిలో గల్లంతయ్యారు. ఇదంతా ఒడ్డున ఉండి గమనిస్తున్న మిగిలిన నేదూరి భానుప్రసాద్, సలాది దుర్గామహేష్, కొమ్మిరెడ్డి చైతన్య కూడా కొట్టుకుపోతున్న మిత్రులను కాపాడేందుకు విఫలయత్నం చేశారు. అప్పటికే వారు గల్లంతైపోవడంతో భయంతో కేకలు వేశారు. అది మారుమూల ప్రాంతం కావడంతో వారిది అరణ్యరోదనే అయ్యింది. ఈ సంఘటనతో భయపడిన భానుప్రసాద్ తణుకు వెళ్లిపోయాడు. మిగిలిన ఇద్దరూ జరిగిన సంఘటనపై ఆయా స్నేహితుల తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు.

గల్లంతైన వారిలో రవితేజ డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉండగా, బాలాజీ బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. కార్తీక్ డిప్లొమా చదువును మధ్యలోనే ఆపేశాడు. ఫణీంద్ర గణేష్ బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ప్రమాదం నుంచి బయటపడ్డ మహేష్ కూడా బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. భాను డ్రైవర్‌గా, చైతన్య బిర్యానీ దుకాణంలో పని చేస్తున్నారు.

యువకులు గల్లంతైన విషయం తెలుసుకున్న కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం నుంచి బయటపడిన చైతన్య, మహేష్‌ల నుంచి వివరాలు సేకరించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ సీఐ పి.శ్రీనివాస్, కాకినాడ ఆర్డీఓ కిషోర్, తహసీల్దార్ ఎస్.పోతురాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటనతో లంక గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. గల్లంతైన వారి కోసం కాకినాడ జిల్లా అగ్నిమాపక అధికారి సురేంద్ర ఆనంద్ ఆధ్వర్యాన సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. కాకినాడ, జగన్నాథపురం శాఖలకు చెందిన సిబ్బంది పడవలపై గాలింపు చేపట్టారు. ఆ ప్రాంతంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు.

పోలీసు సేవలకు సలామ్

- వారి త్యాగాలు అజరామరం
- అమర వీరులకు మంత్రి విశ్వరూప్, కలెక్టర్, ఎస్పీ నివాళి



పోలీసు అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న మంత్రి విశ్వరూప్, కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్, ఎమ్మెల్యే చిట్టిబాబు

అమలాపురం టౌన్: ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయని పోలీసుల త్యాగాలు అజరామరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. 'వారి సేవలకు సలామ్' అంటూ పోలీసు అమర వీరులకు సెల్యూట్ చేశారు. ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత మంత్రి విశ్వరూప్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఏఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ, పోలీసుల త్యాగ నిరతిని కొనియాడారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, దేశాన్ని కాపాడేది సైనికులైతే సమాజంలోని అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడేది పోలీసులని అన్నారు. ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజల ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యంగా పోలీసులు పని చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మరణించిన సఖినేటిపల్లి ఏఎస్సై వీఎస్ సాయిబాబు కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందించి, సత్కరించారు.

ఇటీవల యానాం – ఎదుర్లంక వంతెన వద్ద గోదావరిలో దూకిన ఓ మహిళను అత్యంత సాహసంతో రక్షించిన ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ అంగాని వీరబాబుకు ముఖ్య అతిథులు ప్రశంసాపత్రం అందించి అభినందించారు. అనంతరం అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి పోలీసులు నిర్వహించిన ర్యాలీని మంత్రి విశ్వరూప్, కలెక్టర్ శుక్లా జెండా ఊపి ప్రారంభించారు. నల్లవంతెన వరకూ ర్యాలీగా వెళ్లి, అక్కడ మానవహారం నిర్వహించి, పోలీసు అమర వీరులకు జోహార్లు తెలిపారు. జిల్లా ప్రజల రక్షణకు అహర్నిశలూ చేస్తున్న కృషిని శ్లాఘిస్తూ ఎస్పీ శ్రీధర్‌ను మంత్రి, కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



చెట్టును ఢీకొని బోల్తా పడి నుజ్జయిన బస్సు

చెట్టును ఢీకొట్టిన కళాశాల బస్సు

పి.గన్నవరం: బ్రేకులు ఫెయిలైన ఓ కళాశాల బస్సు చెట్టును ఢీకొని, బోల్తా పడిన ఘటనలో 10 మంది జూనియర్ డాక్టర్లు, డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. ఆ సమయంలో బస్సుకు ఎదురుగా వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎస్సై హరికోటిశాస్త్రి కథనం ప్రకారం.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించేందుకు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల నుంచి 28 మంది జూనియర్ డాక్టర్లు శనివారం ఉదయం కాలేజీ బస్సులో బయలుదేరారు. బండారులంక పీహెచ్‌సీ వద్ద 12 మంది, అంబాజీపేట ఆసుపత్రి వద్ద ఆరుగురు జూనియర్ డాక్టర్లు బస్సు దిగారు. పి.గన్నవరం సీహెచ్‌సీకి నలుగురు, రాజోలు సీహెచ్‌సీకి ఆరుగురు జూనియర్ డాక్టర్లు వెళ్లాల్సి ఉంది. ఈ 10 మంది జూనియర్ డాక్టర్లతో వస్తున్న బస్సు స్థానిక కోకోనట్ కల్యాణ మండపం వద్దకు వచ్చేసరికి బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ గేర్ మార్చి, నియంత్రించేలోపే బస్సు అదుపు తప్పి, రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొని రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు స్వల్పంగా గాయపడిన జూనియర్ డాక్టర్లను బస్సు నుంచి వెలుపలకు తీసుకువచ్చారు. వారిని స్థానికులు, పోలీసులు ద్విచక్ర వాహనాలపై పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించారు. వారితో పాటు, క్లీనర్ మట్టపర్తి దుర్గాప్రసాద్‌కు డ్యూటీ డాక్టర్ చందన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చికిత్స చేశారు. బ్రేకులు ఫెయిలవడంతో ఈ ప్రమాదం జరిగిందని డ్రైవర్ కొప్పిశెట్టి కృష్ణ చెప్పాడు. సమాచారం తెలుసుకున్న కిమ్స్ యాజమాన్యం మూడు అంబులెన్సులతో సీహెచ్‌సీకి వచ్చి జూనియర్ డాక్టర్లను తీసుకువెళ్లింది. కాగా, ఈ ప్రమాదంలో మేడిచర్ల మణికంఠకు చెందిన బైక్ ధ్వంసమైంది. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

దసరా వ్యాపారం అదిరింది

- దసరా పండగ వేళ మార్కెట్లలో కొనుగోళ్ల సందడి
- కళకళలాడుతున్న వస్త్ర, నగల, గృహోపకరణాల దుకాణాలు
- ఆఫర్లతో ఆకట్టుకుంటున్న వ్యాపారులు

సాక్షి, అమలాపురం: దసరా పండగ జోష్ మొదలైంది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ ప్రభుత్వాలు పాఠశాలలకు, కళాశాలలకు దసరా సెలవులు ప్రకటించాయి. దీంతో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి దూర ప్రాంతాల్లో ఉన్న చాలామంది స్థానికులు శుక్రవారం బయలుదేరి స్వస్థలాలకు చేరుకున్నారు. ఇంకా ఉద్యోగ, ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉన్న వారు సైతం పలువురు పెద్ద సంఖ్యలో స్వగ్రామాలకు వస్తున్నారు. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులు నడుపుతూండటంతో స్థానికులు భారీగానే సొంతూళ్లకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో దసరా అమ్మకాలు, కొనుగోళ్లతో సందడి నెలకొంది. పట్టణాలతో పాటు ప్రధాన మార్కెట్లుగా పేరొందిన మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం వస్త్ర, బంగారు, గృహోపకరణాలు, ద్విచక్ర వాహనాలు, కార్ల అమ్మకాలు జరిగే వ్యాపార సంస్థలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలో ప్రధాన పట్టణాలైన అమలాపురం, మండపేట, రామచంద్రపురంతో పాటు వ్యాపార కేంద్రాలైన ద్వారపూడి, రావులపాలెం, ముమ్మిడివరం, ద్రాక్షారామ, కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, మలికిపురం వంటి ప్రాంతాల్లో వివిధ వ్యాపారాలు జోరుగా జరుగుతున్నాయి.

- దసరాకు ఎక్కువగా వ్యాపారం జరిగేది ఆటోమొబైల్ రంగంలోనే. పండగకు కొత్త ద్విచక్ర వాహనాలు, కార్లు కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ద్విచక్ర వాహనాలు, కార్ల కొనుగోళ్లపై ఆయా సంస్థలు భారీ ఆఫర్లు ప్రకటించాయి. పాత వాహనాల ఎక్స్ఛేంజ్, ఆకర్షణీయమైన డిస్కౌంట్ ఆఫర్లు ప్రకటించడంతో కొత్త వాహనాల కొనుగోలుకు వినియోగదారులు బారులు తీరుతున్నారు. 2020–21 సంవత్సరాలకు చెందిన పాత మోడల్ మోటార్ల సైకిళ్లపై రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ ఎక్స్ఛేంజ్ ఆఫర్లు ప్రకటించారు. కార్లకు సైతం పలు రకాల ఆఫర్లు ప్రకటించి, వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆయా సంస్థలు పోటీ పడుతున్నాయి. అమలాపురంలోని వివిధ కంపెనీల వద్ద ఎక్స్ఛేంజ్ ఆఫర్లపై భారీ కటౌట్లు పెట్టి మరీ కస్టమర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.
- కేవలం ద్విచక్ర వాహనాలు, కార్లకే కాదు. గృహోపకరణాలపై సైతం బంపర్ ఆఫర్లు ప్రకటించారు. స్థానిక వ్యాపారులతో పాటు పెద్దపెద్ద ప్రైవేటు సంస్థలు, ఆన్‌లైన్ అమ్మకాలు చేసే సంస్థలు డిస్కౌంట్లు పెట్టాయి. దసరాకు చాలా మంది కొత్త టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఇతర గృహోపకరణ వస్తువులు, ఫర్నిచర్ పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుంటారు. ఆయా ఆఫర్లతో స్థానిక వ్యాపారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా, కార్పొరేట్ సంస్థలు సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలతో హోరెత్తిస్తున్నాయి. స్థానికంగా కొన్ని సంస్థలు వాయిదాల పద్ధతిలో అమ్మకాలు చేస్తున్నాయి.
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం తర్వాత అతి పెద్ద వస్త్ర మార్కెట్ జిల్లాలోని ద్వారపూడిలో ఉంది. సంక్రాంతితో పోల్చుకునే స్థాయిలో కాకున్నా దసరాకు కూడా ఇక్కడ హోల్‌సేల్ వస్త్ర వ్యాపారం ఎక్కువగానే జరుగుతుంది. జిల్లావ్యాప్తంగా చిరు వ్యాపారులతో పాటు పలువురు ఇక్కడకు వచ్చి కొనుగోళ్లు చేస్తున్నారు. ద్వారపూడిలోని మహాత్మాగాంధీ మార్కెట్‌లో సుమారు 330 వరకూ వస్త్ర దుకాణాలున్నాయి. ఇక్కడ సాధారణ రోజుల్లో రోజుకు రూ.1.50 కోట్ల మేర వ్యాపారం జరుగుతుంది. పండగల సమయాల్లో ఇది రూ.3 కోట్ల వరకూ ఉంటోంది. శనివారం అమ్మకాలు పెరిగినా సంక్రాంతి స్థాయిలో లేవని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. అయితే ఆది, సోమవారాల్లో వ్యాపారం అధికంగా ఉండే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. దసరా సందర్భంగా పలు గ్రామాల్లో అమ్మవార్ల జాతరలు పెద్ద ఎత్తున సాగుతూంటాయి. ఈ సందర్భంగా అమ్మవారి పేరు చెప్పి చీరలు సమర్పించడం ఆనవాయితీ. ఇది కూడా వస్త్ర వ్యాపారం పెరగడానికి దోహదపడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.
- దసరా వేళ బంగారు ఆభరణాల కొనుగోళ్లు సైతం జోరుగానే జరుగుతున్నాయి. ఇజ్రాయిల్ యుద్ధం మొదలైన తర్వాత అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరిగిన విషయం తెలిసిందే. అయినప్పటికీ కొనుగోలుదారులు వెనకడుగు వేయలేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.2 కోట్ల మేర బంగారు లావాదేవీలు జరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.
- ప్రభుత్వం విజయ దశమి సెలవును తొలుత సోమవారం సెలవుగా ప్రకటించగా.. చాలా మంది మంగళవారం జరుపుకొంటున్నారు. ఈ కారణంగా ఆదివారంతో పాటు సోమ, మంగళవారాల్లో కూడా వివిధ వ్యాపారాలు మరింత జోరుగా జరుగుతాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.


అమలాపురం బంగారు ఆభరణాల దుకాణం వీధిలో మహిళల సందడి

వెదురుపాకలో వ్యక్తి హత్య

- క్షుద్ర పూజల ఆనవాళ్లతో కలకలం
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన కంచి వెంకటరమణ (38) పాల వ్యాపారం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పాలకేంద్రం వద్ద వ్యాపారం ముగిసిన అనంతరం ఇంటికి చేరుకోలేదు. రాత్రి 9 గంటల తర్వాత కూడా రాకపోవడంతో వెంకట రమణకు భార్య విజయలక్ష్మి కాల్ చేయగా ఫోన్ కలవలేదని సమాచారం. ఇదిలా ఉండగా శనివారం ఉదయం వెదురుపాక నుంచి అరికరేవుల వెళ్లే దారిలో వెంకట రమణ పంట బోదెలో పడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి, ఇంటికి సమాచారం అందించారు. అతడి మృతదేహం కాలువలో పడి ఉండగా, మోటార్ సైకిల్ వంతెనపై ఉంది. అక్కడకు సమీపంలోనే క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండటం స్థానికంగా అలజడి రేపింది.


వెంకట రమణ మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు


ఘటనా స్థలంలో వెంకట రమణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

తలపై బలమైన గాయం

వెంకట రమణ తలపై బలమైన గాయం ఉండటంతో అతడిని ఎవరైనా హత్య చేసి కాలువలో పడవేసి ఉంటారని భావిస్తున్నారు. క్షుద్రపూజల నేపథ్యంలో ఎవరైనా అతడిని హత్య చేశారా? లేక హత్య చేసి, కేసును తప్పుదోవ పట్టించడానికి క్షుద్ర పూజలు చేసినట్లు సృష్టించారా అనేది మిస్టరీగా మారింది. సమాచారం తెలిసిన వెంటనే ఎస్సై జి.నరేష్, ఏఎస్సై పి.వెంకటేశ్వరరావులు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్ కుమార్ కూడా అక్కడకు చేరుకున్నారు. వెంకట రమణకు ఎవరితోనైనా పాత కక్షలున్నాయా, వివాహేతర సంబంధం వంటి కారణాలు, రాత్రి షాపు మూసేసిన తర్వాత ఎక్కడికి వెళ్లాడు, అతడి వెంట ఎవరున్నారు, ఈ హత్యలో ఎవరి ప్రమేయం ఉండి ఉంటుంది, హత్యకు అసలు కారణాలేమై ఉంటాయనే పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. వెంకట రమణకు భార్య విజయలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం రాత్రి వరకూ అందరితో మాట్లాడిన అతడు ఉదయానికి విగతజీవిగా పడి ఉండటంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. తాము ఎలా జీవించాలని కన్నీటిపర్యంతమవుతున్నారు. ఈ సంఘటనపై భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.